సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 1 । జూన్ । 2025



తీరం.. త్రివర్ణం

రుషికొండ బీచ్‌లో భారీ జాతీయ జెండాతో ఎన్‌సీసీ విద్యార్థుల ప్రదర్శన

8లో

పల్లంరాజుకే పట్టం

అవినీతిపరులకే జీవీఎంసీలో అందలం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) చీఫ్ ఇంజినీర్ పోస్టు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికే కూటమి ప్రభుత్వం పట్టం కట్టింది. జీవీఎంసీ సీఈగా పల్లంరాజును నియమించాలని నిర్ణయించింది. మంత్రి అండదండలతో సీఈగా బాధ్యతలు చేపట్టనున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ) ఎస్‌ఈగా పల్లంరాజు పని చేస్తున్న సమయంలో ఏసీబీ దాడులు జరిగాయి. 2020 ఫిబ్రవరిలో జరిగిన దాడుల్లో కేసు కూడా నమోదైంది. ఈ దాడుల్లో పల్లంరాజు తన కుటుంబ సభ్యుల పేరుతో 13 ప్రాపర్టీలు కొనుగోలు చేసినట్టు ఏసీబీ గుర్తించింది. రూ. 27 లక్షల విలువైన బంగారాన్ని, రూ. 28.2 కోట్ల విలువైన ఎఫ్‌డీలను కూడా స్వాధీనం చేసుకుంది. పల్లంరాజు పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో 1993లో ఏఈగా చేరి.. 2020 నాటికి ఎస్‌ఈగా పదోన్నతి పొందారు. ఇటువంటి అవినీతి ఆరోపణలు ఉన్న వ్యక్తికి రాష్ట్రంలోనే అతి పెద్ద కార్పొరేషన్‌గా ఉన్న జీవీఎంసీలో ఏకంగా సీఈ పోస్టు దక్కడం ఇప్పుడు మున్సిపల్ శాఖలో చర్చనీయాంశమైంది.

మంత్రి అండదండలతో..

జీవీఎంసీ సీఈగా రావాలని ప్రస్తుతం స్వర్ణాంధ్ర కార్పొరేషన్‌లో పనిచేస్తున్న వ్యక్తితో పాటు జీవీఎంసీలోనే ఉన్న మరో వ్యక్తి ప్రయత్నించారు. అయితే స్వర్ణాంధ్ర కార్పొరేషన్‌లో పనిచేస్తున్న సీఈని పంపేందుకు మంత్రి నారాయణ అంగీకరించలేదని తెలుస్తోంది. జీవీఎంసీలో పనిచేసే మరో ఇంజినీర్ ఈ పోస్టు కోసం బాగా ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మంత్రి అండదండలతో పాటు స్థానికంగా ఉన్న ఓ ఎమ్మెల్యే పల్లంరాజు వైపే మొగ్గుచూపినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో మంత్రి అండదండలు పొందేందుకు పల్లంరాజు చేసిన ప్రయత్నాలు ఫలించినట్లు జీవీఎంసీలో చర్చ నడుస్తోంది. అవినీతి కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తికి కీలకమైన పోస్టింగులు ఇవ్వకూడదనేది సాధారణ నియమం. ఈ నియమానికి భిన్నంగా మంత్రి.. పల్లంరాజు వైపు మొగ్గ చూపడంతో భారీ వ్యవహారమే నడిచిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏసీబీ కేసులు ఉన్నప్పటికీ పల్లంరాజుకు సీఈ పదవి వరించినట్టు జీవీఎంసీలో టాక్.

నేడు వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ 4వ తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి సంబంధించి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం ఆదివారం జరగనుంది. మద్దిపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు హాజరుకానున్నారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ ముఖ్య నాయకులు, మాజీ శాసనసభ్యులు, సమన్వయకర్తలు హాజరుకావాలని కేకేరాజు పిలుపునిచ్చారు.



దళితుల భూములు

పేరు అబద్ధం కబ్జా నిజం!

దళితులకు చెందిన 103 ఎకరాలను కాజేసిన టీడీపీ నేత

- భూముల విలువ రూ. 50 కోట్ల పైమాటే!
- పంట నష్టపరిహారం, బీమా సైతం కాజేత
- ప్రశ్నిస్తే హోం మంత్రి పేరుతో బెదిరింపులు

దళిత వర్గానికి చెందిన మహిళ మంత్రిగా ఉన్నప్పటికీ దళితుల భూములకు రక్షణ కరువైంది. ఆమె అనుచరుడే భూములను ఆక్రమించి దళిత రైతులపై తప్పుడు కేసులు బనాయించడం వివ్వెరపరుస్తోంది. హోంమంత్రి అనిత ముఖ్య అనుచరుడు సుమారు రూ.50 కోట్ల విలువైన 103 ఎకరాలను కబ్జా చేశాడు.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

పేరులోనే కాదు అక్రమ వ్యవహారాల్లోనూ ఓ టీడీపీ నేత సార్థక నామధేయుడినని నిరూపించుకున్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం మండలం టీడీపీ నేత అమలకంటి అబద్ధం హోంమంత్రి అనితకు ముఖ్య అనుచరుడు. దళిత వర్గానికి చెందిన అనిత హోంమంత్రిగా ఉన్నప్పటికీ ఆమె అనుచరుడు మాత్రం నిరుపేద దళితుల భూములను ఆక్రమించి దర్జాగా సాగు చేసుకోవడం గమనార్హం. తమ తాతలు, తండ్రుల కాలం నుంచి సాగు చేసుకుంటున్న డీ పట్టా భూములను ఆక్వా సాగు పేరుతో లీజుకు తీసుకుని అనిత ముఖ్య అనుచరుడు కాజేశారని బాధితులు వాపోతున్నారు. రూ.50 కోట్ల విలువ చేసే 103 ఎకరాల భూముల రికార్డులను విశాఖ ఆక్వాఫారానికి చెందిన జగన్‌మోహన్‌రావుతో కలిసి మార్పు చేసి తనవరం చేసుకున్నట్లు పేర్కొంటున్నారు. తమ భూములను తమకివ్వాలని కోరితే కేసులు నమోదు చేయించి స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని ఆక్రోశిస్తున్నారు. మరోవైపు ఈ భూముల రికార్డులన్నీ తారుమారు చేసి... పంట నష్టపరిహారంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీలు పొందుతుండటం గమనార్హం.

ఆక్వా సాగు పేరుతో..

ఎస్.రాయవరం మండలం వాకపాడు రెవెన్యూ పరిధిలోని 73, 74, 75, 77, 78, 344, 345, 346, 347, 348, 351, 352, 353, 354, 435, 438, 439, 441, 442, 443, 445 సర్వే నంబర్లలో సుమారు 103 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ప్రభుత్వం వీటిని సుమారు 30 ఏళ్ల క్రితం తంతటి సూర్యారావు (పట్టానెం 41/98), దండా కొండయ్య (42/98), పెయ్యిల నాగరాజు (43/98), గారా నర్సింహులు, జల్లూరి అప్పారావు, దండా త్రిమూర్తులు, దండా అప్పన్న, దండా తాతబ్బాయి, గారా అప్పయ్యమ్మ, బీరా నాగన్న, గారా అప్పారావు, కొప్పిశెట్టి మాణిక్యం, కొప్పిశెట్టి అప్పారావు, కొప్పిశెట్టి అయ్యన్న తదితర స్థానిక పేద రైతుల పేరుతో డీ-ఫారం పట్టాలు మంజూరు చేసింది. అప్పటినుంచి వీరంతా ఈ భూములను సాగుచేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ భూములపై కన్నేసిన టీడీపీ నేత 'అబద్ధం'.. తనకు లీజుకు ఇస్తే ఆక్వా లాభాల్లో వాటా ఇస్తానని నమ్మబలికి పదేళ్ల క్రితం వారి నుంచి తీసుకున్నాడు. ఎమ్మెల్యే అనిత అండదండలతో 2014లో ఈ భూమిని 42 సబ్ డివిజన్లుగా విభజించి.. ఈ ప్రాంతానికి సంబంధం లేని విశాఖ ఆక్వాఫారానికి చెందిన జగన్‌మోహన్ రావు తండ్రి వీరభద్రరావును తెరమీదకు తీసుకు వచ్చి అతని పేరున మ్యూటేషన్ (వెబ్‌ల్యాండ్‌లో) చేశారు. ఈ 42 సబ్ డివిజన్‌లకు 42 ఖాతా నెంబర్లు ఇచ్చారు. ఈ భూముల్లో ఆక్వా కాకుండా వరి సాగు చేస్తున్నాడు. తమ భూములకు లీజు చెల్లించాలని లేదంటే వెనక్కి ఇవ్వాలని కోరిన రైతులను బెదిరిస్తూ హోంమంత్రి సహకారంతో పోలీసు కేసులు పెట్టి వేధిస్తున్నాడు.

సాగు చేస్తూ.. నష్టపరిహారం తీసుకుంటూ..

సదరు టీడీపీ నేత పదేళ్లుగా ఈ భూముల్లో ఏటా 3 వేల బస్తాల ధాన్యం పండిస్తూ.. తమకు ఒక్క గింజ కూడా ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా రైతుల నుంచి అక్రమంగా లాక్కున్న భూముల్లో సాగుచేస్తున్న పంటలకు నష్టం వాటిల్లిందంటూ తన పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వం నుంచి తాను, తన కుటుంబ సభ్యుల పేరుతో ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారాన్ని పొందారు. దళితులకు చెందిన ఈ భూములు ఉన్న ప్రాంతాలకు పక్కనే ఆక్వా సాగు జరుగుతోంది. దీంతో ఈ భూములకు మార్కెట్‌లో ధర కూడా బాగానే ఉంది. 103 ఎకరాల భూములకు రూ.50 కోట్ల మేరకు విలువ ఉంటుందని తెలుస్తోంది. తమ భూములు తమకివ్వాలంటూ పలుమార్లు కోరినా అధికారులు కూడా పట్టించుకోవడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు.






రైతులకు డీ పట్టా ఇచ్చినట్లు తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు



ఆక్వా ఫారం జగన్‌మోహన్ రావు పేరుతో ఆర్‌వోఆర్‌లో మార్పులు చేసిన రికార్డు పత్రం



అబద్ధం పేరుతో పంట నష్ట పరిహారం కోసం తయారు చేసిన నివేదిక

మోసగించి కాజేశారు..

ఈ భూములను సాగు చేసుకునేందుకు మా పూర్వీకులకు ప్రభుత్వం పట్టా ఇచ్చింది. వెంకటాపురం గ్రామానికి చెందిన 'అబద్ధం' అనే టీడీపీ నాయకుడు, జగన్‌మోహన్‌రావు అనే వ్యక్తి మమ్మల్ని మోసం చేసి భూములను లాక్కున్నారు. ఒక్క పైసా లీజు ఇవ్వకపోగా పోలీసు కేసులు పెట్టి వేధిస్తున్నారు. వారి ఆగడాలకు తట్టుకోలేక ఏం చేయాలో తోచక భయంతో జీవిస్తున్నాం. మా దగ్గర పట్టాలు ఉన్నాయి.


–తంతటి సూర్యారావు, వెంకటాపురం, ఎస్.రాయవరం మండలం



పట్టాలున్నాయి..

ప్రభుత్వం మా పూర్వీకులకు ఇచ్చిన భూములను అబద్ధం అనే టీడీపీ నాయకుడు ఆక్రమించుకున్నాడు. రాజకీయ పలుకుబడి ఉపయోగించి మమ్మల్ని భూముల్లోకి రానివ్వకుండా బెదిరిస్తున్నారు. కేసులు బనాయిస్తున్నారు. మా దగ్గర పట్టాలు ఉన్నాయి.

– పెయ్యిల నాగరాజు, వాకపాడు



ఇద్దరూ కలిసి కబ్జా

మా తాత, తండ్రులకు డీ-ఫారం పట్టాలు ఇచ్చారు. ఈ భూముల్లో గంటి, జొన్న సాగు చేసే వాళ్లం. పెట్టుబడులు పెట్టలేక ఆకుల జగన్మోహన్‌రావు అనే వ్యక్తికి లీజుకు ఇస్తే టీడీపీ నాయకుడు అబద్ధంతో కలిసి కబ్జా చేశారు. మా భూములు మాకు అప్పగించాలని కోరితే కేసులు పెట్టి వేధిస్తున్నాడు. మావద్ద ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నాయి.

– దండా తాతబ్బాయి, వాకపాడు, ఎస్.రాయవరం మండలం



భూములు చూపిస్తున్న రైతు

మా భూములు మాకు అప్పగించాలి

మాకు ఈ భూములు మినహా వేరే ఆధారం లేదు. వయసు పైబడటంతో కష్టంగా ఉంది. అబద్ధం అనే నాయకుడు మా భూములు ఆక్రమించి సాగుచేస్తున్నాడు. మా భూములు మాకు అప్పగించి న్యాయం చేయాలి.

–దండా మాణిక్యం, వాకపాడు

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, విశాఖపట్నం: ఈ నెల 4వ తేదీన తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపునిచ్చారు. శనివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో 'వెన్ను పోటు దినం పోస్టర్'ను ఆయన ఆవిష్కరించారు. 2024 ఎన్నికల్లో అమలుకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని ఎండగడుతూ వెన్నుపోటు దినానికి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు అల్లు శంకరరావు, కె.అనిల్ కుమార్ రాజు, రెయ్యి వెంకట రమణ, బర్కత్ అలీ, సేనాపతి అప్పారావు, పేడాడ రమణి కుమారి, పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, డిప్యూటీ మేయర్ సతీష్, నాయకులు

పెందుర్తి టీడీపీలో కల్లోలం

- బండారు–బాబ్జీ వర్గాల మధ్య ఆధిపత్య పోరు
- గండి బాబ్జీ ఏకపక్షంగా వ్యవహరించడంతో మునలం
- సంచలనంగా మారిన 400 మంది రాజీనామాలు

పెందుర్తి: 'మూడు నాలుగు దశాబ్దాలుగా పార్టీకి సేవ చేస్తున్నాం. కష్టపడి పార్టీని 2024లో అధికారంలోకి తీసుకువచ్చాం. ఇప్పుడు మాకు విలువ లేకుండా పోయింది. ఓ వైపు జనసేన స్థానిక నాయకుల వేధింపులు తట్టుకోలేకపోతున్నాం. మరోవైపు స్వపక్షంలోనే మమ్మల్ని పురుగులను చూసినట్లు చూస్తున్నారు. ఏ నిర్ణయంలోనూ పార్టీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ మాకు కనీస ప్రాధాన్యం ఇవ్వడం లేదు' ఇదీ సబ్బవరం మండలంలోని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి అనుకూలంగా ఉండే సీనియర్ టీడీపీ నాయకుల ఆవేదన. అధికారంలోకి వచ్చేశాం.. కూటమిలో పెద్దన్న పాత్ర మాదే.. గ్రామాల్లో ఊపేద్దాం అని ఊహల్లో తేలిన సీనియర్ తమ్ముళ్లకు ఏడాదిలోనే తత్వం బోధపడింది. మొన్నటి ఎన్నికల సమయంలో టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన గండి బాబ్జీ తమను పురుగుల కంటే హీనంగా చూస్తున్నారని రగిలిపోతూ మూకుమ్మడి రాజీనామాల అస్త్రాన్ని ప్రయోగించారు. ఇన్నాళ్లు నివురుగప్పిన నిప్పులా ఉన్న పెందుర్తి నియోజకవర్గ టీడీపీ వర్గపోరు ఒక్కసారిగా రచ్చకెక్కింది. కాగా టీడీపీలో జరుగుతున్న పరిణామాలను చూసి నియోజకవర్గంలోని జనసేన కేడర్ ఓ తెలుగు సినిమాలో డైలాగ్‌లా 'నవ్వు ఆపుకుంటున్నావ్ కదరా' అన్నట్లు ముసిముసిగా నవ్వుకుంటుంది.



రాజీనామా పత్రాలను ప్రదర్శిస్తున్న తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు

తాడోపేడో..

గత ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గంలో అధికారం కోసమే జనసేన, టీడీపీలోని బండారు, గండి బాబ్జీ వర్గాలు పనిచేశాయి. కొద్దిరోజులకే జనసేన తరపున పోటీ చేసిన గెలిచిన పంచకర్ల రమేష్‌బాబు టీడీపీ కేడర్‌ను ముఖ్యంగా గండి బాబ్జీ వర్గాన్ని ప్రత్యర్థుల జాబితాలో చేర్చేశారు. కొన్ని గ్రామాల్లో బండారు వర్గాన్ని మాత్రం పంచకర్ల చేరదీశారు. తొలి నుంచి బండారు, బాబ్జీ వర్గీయులు ఒకే పార్టీలో ఉప్పూనిప్పులాగే ఉన్నారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే చింతగట్ల పంచాయతీలో బండారు వర్గీయులు మీడియా సమావేశం పెట్టి గండి బాబ్జీని ఘాటుగానే విమర్శించారు. అంతటితో ఆగకుండా బాబ్జీపై ఏకంగా మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన బాబ్జీ బండారు వర్గాన్ని పూర్తిగా దూరం పెట్టారు. నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ పదవుల్లో కూడా తన వర్గీయులకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చుకుంటూ వచ్చారు. చివరకు ప్రభుత్వ పెద్దల దగ్గర తన పలుకుబడిని ఉపయోగించి బండారు వర్గీయులెవ్వరికి పనులు జరగకుండా నియంత్రించారు. పార్టీ కార్యక్రమాలకు సైతం బండారు వర్గాన్ని దూరం పెట్టారు. మినీ మహానాడు వంటి కార్యక్రమాలకు సైతం నియోజకవర్గంలోని టీడీపీ కీలక నాయకులకు సమాచారం ఇవ్వలేదు. దీంతో ఇక బాబ్జీ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నంతకాలం తమకు ప్రాధాన్యత ఉండదని తెలుసుకున్న టీడీపీ పాతకాపులు సుమారు 400 మంది శనివారం సబ్బవరంలో రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించారు.

పంచకర్ల దెబ్బేనా..

వారం రోజుల క్రితం కూటమి ఆధిపత్య పోరులో భాగంగా జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మధ్య వీఎంఆర్‌డీఏ వేదికగా పెద్ద గొడవ జరిగింది. ఓ దశలో నువ్వా నేనా అంటూ కొట్టుకునేంతగా రెచ్చిపోయారు. ఈ నేపథ్యంలో సబ్బవరంలో ఒకేసారి దాదాపు 400 మంది గండి బాబ్జీపై తిరుగుబావుటా ఎగురేసి రాజీనామాలు చేయడం గమనార్హం. ఇప్పటికే నియోజకవర్గంలో బండారు వర్గీయులను పంచకర్ల చేరదీస్తున్న మాట వాస్తవం. ఈ క్రమంలో ఇలా మూకుమ్మడి రాజీనామాలు చేయడం వెనుక పంచకర్ల హస్తం ఉందన్న ప్రచారం జరుగుతుంది. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా కేవలం పెందుర్తిలో పెత్తనం.. ఆధిపత్యం.. పదవుల కోసం ఇలా టీడీపీ కేడర్ కొట్టుకోవడాన్ని మాత్రం ప్రజలు ఛీదరించుకుంటున్నారు.

నేడు కానిస్టేబుల్ మెయిన్స్ రాత పరీక్ష

- జిల్లాలో 27 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 12,491 మంది అభ్యర్థులు



పెందుర్తిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి, చిత్రంలో ఏసీపీ పృథ్వీతేజ

విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్(సివిల్, ఏపీఎస్పీ) అభ్యర్థులకు మెయిన్స్ రాత పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లాలో 27 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుంది. మొత్తం 12,491 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు పోలీసులు పలు సూచనలు చేశారు.

- పరీక్షకు గంట ముందే అభ్యర్థుల కేంద్రాలకు చేరుకోవాలి.
- అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు.
- హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలి.
- హాల్ టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్నులను తెచ్చుకోవాలి.
- అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేస్తారు.
- సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, ఇతర వస్తువులు పరీక్ష హాల్లోకి అనుమతించరు.
- అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తారు.
- అన్ని పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలోని జిరాక్స్, కంప్యూటరు కేంద్రాలను మూసివేయాలి.

కదల్లేని వయసులో కష్టం

- ఈ నెలా పింఛన్ల కోసం వృద్ధుల అవస్థలు
- 92.61 శాతం మందికి పింఛన్ల అందజేత



పెద జాలరిపేటలో రోడ్డు మీద పింఛన్ల పంపిణీ

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా.. పింఛన్‌దారుల కష్టాలు తీరకపోగా మరింత పెరిగాయి. గత ప్రభుత్వ హయాంలో ఇంటికే వచ్చి పింఛన్లు అందించే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసి.. ఇప్పుడు వృద్ధులు, వికలాంగులు, మహిళలను సచివాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. నెలవారీ పింఛన్ కోసం గంటల తరబడి ఎండలో నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. శనివారం పెదజాలారిపేట సచివాలయం వద్ద ఉదయం 11 గంటల తర్వాత గానీ పింఛన్ల పంపిణీ ప్రారంభం కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఒకే దగ్గర లబ్ధిదారులను చేర్చి.. పింఛన్ల పంపిణీ జరిగింది. బయోమెట్రిక్ ద్వారానే పంపిణీ అని చెబుతున్నా.. అనేక చోట్ల సాంకేతిక సమస్యతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర అవస్థలు పడ్డారు.

పింఛన్లలో భారీ కోత

ఎన్నికల ముందు 50 ఏళ్లు దాటిన వారందరికీ పింఛన్లు ఇస్తామని హామీల వర్షం కురిపించి.. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చింది కూటమి ప్రభుత్వం. ఇప్పుడు ఆ వాగ్దానాన్ని నెరవేర్చకపోగా.. 60 ఏళ్ల పైబడి అర్హులైన వారి పింఛన్లలోనూ భారీగా కోత పెడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 1.68 లక్షల మంది పింఛనుదారులు ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తెలివిగా ప్రతి నెలా దాదాపు వెయ్యి మంది చొప్పున లబ్ధిదారులను తొలగిస్తూ వచ్చింది. దీంతో జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 1,59,085కు పడిపోయింది. గడిచిన ఏడాది కాలంలోనే సుమారు 9 వేలకు పైగా అర్హులైన పింఛన్‌దారులను అన్యాయంగా తొలగించిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.



పెదజాలరిపేట సచివాలయానికి తాళం వేసిన దృశ్యం.. బయట వేచి ఉన్న పింఛనుదారులు

ఒక్క రోజు ముందుగానే..

జిల్లాలో శనివారం ఎన్టీఆర్ సామాజికభద్రత పింఛన్ల కార్యక్రమం జరిగింది. జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో మొత్తం 1,59,085 పింఛన్లు ఉండగా.. ప్రభుత్వం రూ.69.64 కోట్లను విడుదల చేసింది. శనివారం రాత్రి ఏడు గంటలకు 1,47,826 మందికి రూ.64.45 కోట్లను సచివాలయం సిబ్బంది అందజేశారు. జిల్లాలో మొత్తం 92.92 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీపతి తెలిపారు. మిగిలిన వారికి సోమవారం అందజేస్తామని వెల్లడించారు.



పింఛన్ అందిస్తున్న సచివాలయ కార్యదర్శి

యోగా వేడుకల విజయవంతానికి చర్యలు

- రవాణా, పార్కింగ్‌పై దృష్టి సారించాలి
- ఏర్పాట్లను సమీక్షించిన నోడల్ అధికారి డాక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న నోడల్ అధికారి మల్లికార్జున, చిత్రంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్దేశిత సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా పక్కా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్, యోగా ఉత్సవాల మొబలైజేషన్, ట్రాన్స్‌పోర్టు నోడల్ అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున జిల్లా అధికారులను ఆదేశించారు. యోగా ఉత్సవాల నిర్వహణ, రవాణా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు శనివారం జిల్లాకు వచ్చిన ఆయన.. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, జేసీ కె.మయూర్ అశోక్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌లతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం లక్ష్యాన్ని చేరుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. బీచ్‌రోడ్డులో ఎంత మంది కూర్చోగలరు. అదనపు వేదికల్లో ఎంత మందికి అవకాశం ఉంటుందనే విషయాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ప్రతి 24 చదరపు అడుగులకు ఒకరు యోగాసనాలు వేసేందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్‌కు తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కంపార్ట్‌మెంట్ల వారీగా బస్సులు కేటాయించాలని, ఆయా వాహనాలకు నిర్దేశిత స్థలాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల రాకపోకల విషయంలో గందరగోళం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో చేపట్టిన చర్యలను కలెక్టర్ హరేందిర ప్రసాద్ మ్యాప్‌ల ద్వారా వివరించారు. భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ



ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు గణబాబు, శిరీష

మద్దిలపాలెం: క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని, తద్వారా సమాజానికి అత్యుత్తమ మానవ వనరులుగా నిలుస్తారని ఎమ్మెల్యేలు గణబాబు, గౌతు శిరీష అన్నారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీగా ఎంపికైన డాక్టర్ డి.భగీరథ కుమార్, ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన డి.ప్రసన్న కుమార్ సత్కార కార్యక్రమం శనివారం మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో విశాఖ తన స్థానాన్ని పదిలం చేసుకుంటోందన్నారు. నగరానికి చెందిన భగీరథ కుమార్, ప్రసన్నకుమార్‌లు జాతీయ స్థాయిలో ఉన్నత పదవులను అందుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. విశాఖ నగరానికి, చేపట్టిన పదవులకు మరింత పేరు తెచ్చే విధంగా కృషి చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. అనంతరం భగీరథ కుమార్, ప్రసన్న కుమార్‌లను ఎమ్మెల్యేలు సత్కరించారు. విశాఖ జిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ చంద్ర, కార్యదర్శి శీలం లక్ష్మణ్, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి థామస్ అయ్య, కళాభారతి కార్యదర్శి జి.రాంబాబు పాల్గొన్నారు.

తీరం.. త్రివర్ణం

కొమ్మాది: రుషికొండలోని గాయత్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 13వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. గాయత్రీ కళాశాల వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ రుషికొండ బీచ్‌కు చేరుకుంది. అక్కడి నుంచి సాగర్‌నగర్ వరకు ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా కల్నల్ నీరజ్ కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు సాధించిన అజేయ విజయానికి సంఘీభావంగా, అమరులైన జవాన్లకు నివాళులర్పిస్తూ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. 300 మీటర్ల మువ్వన్నెల జెండాతో వందేమాతరం, వందే భారత్ అనే నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీ సాగింది. వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన 610 మంది ఎన్‌సీసీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్

పార్టీకి సోషల్ మీడియా కార్యకర్తలే బలం

వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీకి సోషల్ మీడియా కార్యకర్తలే కొండంత బలమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోషల్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసిందని ఆరోపించారు. జిల్లాలో 8 మంది సోషల్ మీడియా కార్యకర్తలపై రాష్ట్రంలోని పలు పోలీస్‌స్టేషన్లలో 50కి పైగా అక్రమ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్దిలపాలేనికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త బోస రమణారెడ్డిపై ఆరు కేసులు, గాజువాక మండలం గొల్లజగ్గరాజుపేటకు చెందిన బొడి వెంకటేష్‌పై మొత్తం 17 కేసులు, విశాఖకు చెందిన ఇంటూరి రవికిరణ్‌పై రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మొత్తం 21 కేసులు, అలాగే ప్రసాద్ సిద్ధు, గోపిరాజు వంకా, సదరం జ్ఞానేష్‌లపై



సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేశారన్నారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన ప్రతి అధికారిని గుర్తుపెట్టుకోండన్నారు. రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడం తథ్యమన్నారు. ప్రజా సంకల్ప యాత్ర దగ్గర నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి వరకు సోషల్ మీడియా కార్యకర్తలు అండగా నిలిచారని గుర్తు చేశారు. మరోమారు పార్టీకి, అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్లు, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా సత్యనారాయణ

మహారాణిపేట: ఎలక్ట్రిసిటీ కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రసల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) చైర్మన్‌గా బి.సత్యనారాయణ రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ఈపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. శనివారం సత్యనారాయణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. 2022 నుంచి 2025 వరకు సత్యనారాయణ సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా సేవలందించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానాల్లో 1998 నుంచి 2022 వరకు పలు హోదాల్లో న్యాయమూర్తిగా పనిచేశారు. 2022లో జిల్లా జడ్జిగా పదవీ విరమణ పొందారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో తీర్పులిచ్చారు. కాగా సత్యనారాయణ పునర్నియామకం పట్ల రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర సలహా కమిటీ



నూతన చైర్మన్ సత్యనారాయణను అభినందిస్తున్న సీజీఆర్ఎఫ్ సభ్యులు

సభ్యుడు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, ఏపీ ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.హరిబాబు(ఫైనాన్స్), సీజీఆర్ఎఫ్ సభ్యులు ఎ.మురళీకృష్ణ (ఇండిపెండెంట్), ఎస్.సుబ్బారావు (ఫైనాన్స్), బి.సులేఖరాణి (టెక్నికల్) హర్షం ప్రకటించారు.

తొట్లకొండపై నేడు యోగాసనాలు



తొట్లకొండపై స్థల పరిశీలన చేస్తున్న జిల్లా పర్యాటకశాఖ అధికారి మాధవి

కొమ్మాది: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఆదివారం తొట్లకొండపై 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టూరిజం అధికారి జె.మాధవి తెలిపారు. ఉదయం 6.30 నుంచి 8.00 గంటల వరకు ఇండియన్ నేవీ, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వివిధ యోగా అసోసియేషన్ల సభ్యులు, జిల్లా అధికారులు యోగాసనాలు వేస్తారన్నారు. నగర పౌరులు కూడా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భూముల అభివృద్ధికి పలు సంస్థల ఆసక్తి

విశాఖ సిటీ: మధురవాడలోని భూముల అభివృద్ధికి ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు ఆసక్తి చూపించినట్లు వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేష్ తెలిపారు. వీఎంఆర్‌డీఏకు చెందిన 87.80 ఎకరాల భూమిని పీపీపీ విధానంలో సంయుక్త అభివృద్ధి చేసేందుకు గల అవకాశాలను వివరించేందుకు శనివారం బెంగుళూరులో నైట్ ఫ్రాంక్ కార్యాలయంలో రోడ్ షో నిర్వహించారు. ఇందులో ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ సంస్థలైన గోద్రేజ్ ప్రాపర్టీస్, ఉషా శ్రీరామ్ ప్రాపర్టీస్, స్థానిక రియల్ ఎస్టేట్ సంస్థలు హాజరైనట్లు పేర్కొన్నారు. భూముల అభివృద్ధిపై సంసిద్ధతను వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఈ రోడ్



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేష్

షోలో వీఎంఆర్‌డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, సీతభవానీశంకర్, నైట్ ఫ్రాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పద్మం సిల్వర్ జ్యూయలరీ షోరూం ప్రారంభం

మద్దిలపాలెం: మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో పద్మం 92.5 సిల్వర్ జ్యూయలరీ షోరూం శనివారం ఘనంగా ప్రారంభమైంది. సీఎంఆర్ వ్యవస్థాపకుడు, చైర్మన్ మావూరి వెంకటరమణ ఈ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా నమ్మకమైన సేవలందిస్తూ.. వినియోగదారుల హృదయాల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నామన్నారు. అదే నమ్మకానికి నిదర్శనంగా సీఎంఆర్ గ్రూప్ నుంచి పద్మం 92.5 సిల్వర్ జ్యూయలరీ షోరూంను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రస్తుత ట్రెండ్‌కు తగిన బ్రాండ్‌లతో.. సరికొత్త వెండి ఆభరణాలతో సీఎంఆర్ సెంట్రల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో షోరూంను ప్రారంభించామని వెల్లడించారు. ప్రారంభోత్సవ కానుకగా అన్ని రకాల వెండి ఉత్పత్తులపై ఫ్లాట్ 20 శాతం తగ్గింపు, ఆభరణాల కొనుగోలుపై గ్యారెంటీ కార్డుతో పాటు కచ్చితమైన బైబ్యాక్ పాలసీ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళల మనసుకు హత్తుకునే సరికొత్త డిజైన్‌లతో సిల్వర్ జ్యూయలరీ ఆభరణాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు.



పద్మం సిల్వర్ జ్యూయలరీ షాపులో మహిళల సందడి

దళిత మహిళను మోసం చేసిన ఇద్దరికి రిమాండ్





మీసాల అప్పలనాయుడు మీసాల జ్యోతి

తగరపువలస: భూమి రిజిస్ట్రేషన్ పేరుతో నగరానికి చెందిన దళిత మహిళ కుంచంగి లక్ష్మిని మోసం చేసి రూ.97 లక్షలు కాజేసిన ఆనందపురానికి చెందిన మీసాల అప్పలనాయుడు, శ్రీదేవి దంపతులను పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. భీమిలి 15వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ వారికి 15 రోజుల పాటు రిమాండ్ విధించారు. బాధితురాలు ఆనందపురం మండలం చందక పంచాయతీలో మధ్యవర్తుల సాయంతో 30 సెంట్ల భూమిని కొనుగోలు చేసింది. అప్పటికే నకిలీ పత్రాలతో నిందితులు ఆ భూమి తమదిగా చూపించి బాధితురాలి నుంచి డబ్బులు కాజేశారు. భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుకోవడంతో పాటు బాధితురాలిపై దాడి కూడా చేశారు. దీంతో పోలీసులు వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

నేటి నుంచి డిపోల్లో రేషన్ పంపిణీ

ఎండీయూ వాహనాలను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం

మహారాణిపేట: జిల్లాలో ఆదివారం నుంచి రేషన్ సరకులు నేరుగా రేషన్ డిపోల వద్ద పంపిణీ చేయనున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం నిలిపివేసి ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని 642 డిపోల ద్వారా 5.34 లక్షల తెల్ల రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదార వంటివి పంపిణీ చేయనున్నారు. ఈ ఏర్పాట్లను జిల్లా ప్రత్యేక అధికారి భగవన్నారాయణ పర్యవేక్షించారు. ఆయన ఇప్పటికే డీలర్లతో సమావేశాలు నిర్వహించి, గోదాముల్లో సరకుల లభ్యత, డిపోల వద్ద ఏర్పాట్లు, ధరల పట్టికలు వంటి విషయాలను సమీక్షించారు. డీఎస్‌వో వి.భాస్కరరావు పోస్ మెషీన్ల మరమ్మతులు కూడా పూర్తి చేశారు. కాగా, ఇంటింటికీ రేషన్ సరఫరా చేసేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 310 ఎండీయూ వాహనాలను రద్దు చేయడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వాహనాల ద్వారా అనేక మంది ఉపాధి పొందారు. వీటిని నిలిపివేయడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి.



మర్రిపాలెం గోదాములో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి భగవన్నారాయణ, డీఎస్‌వో భాస్కర్

ఇదిలా ఉండగా.. చాలా మంది కార్డుదారులకు డిపోలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు ఎండీయూ వాహనాల ద్వారా ఇంటికే సరుకులు వచ్చేవి కాబట్టి డిపోల గురించి చాలా మందికి అవగాహన లేదు. స్థానికంగా ఉన్న కొందరికి కూడా డిపోలు ఎక్కడున్నాయో తెలియకపోవడం గమనార్హం.

హాస్టళ్లలో సెల్‌ఫోన్ల చోరీ కేసు ఛేదన

నిందితుడి అరెస్ట్, 12 ఫోన్లు స్వాధీనం

తాటిచెట్లపాలెం: ద్వారకానగర్‌లోని హాస్టళ్లలో జరిగిన సెల్‌ఫోన్ల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి నిందితుడిని అరెస్ట్ చేసి.. అతని వద్ద నుంచి 12 సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు క్రైం ఏడీసీపీ మోహనరావు తెలిపారు. ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. ద్వారకానగర్‌లోని శ్రీ చక్ర బాయ్స్ హాస్టల్‌ను కొవ్వూరి సోమిరెడ్డి నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 7న ఆ హాస్టల్‌లో ఉంటున్న గణేష్ అనే విద్యార్థి తన ఫోన్ కనిపించడం లేదని సోమిరెడ్డికి తెలిపాడు. దీంతో ఆయన హాస్టల్‌లో విచారించగా.. హాస్టల్‌లో మొత్తం ఆరు ఫోన్లు, అదే ప్రాంగణంలోని మరో హాస్టల్‌లో ఐదు ఫోన్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో సోమిరెడ్డి ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణలో నిందితుడు కనకం దామోదర్‌గా గుర్తించారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టిన



వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ మోహనరావు. చిత్రంలో రికవరీ చేసిన మొబైల్ ఫోన్లు

పోలీసులు మే 27న అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 12 సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. కనకం దామోదర్‌పై గతంలో కూడా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు 20 సెల్‌ఫోన్ దొంగతనం కేసులు నమోదై ఉన్నాయని ఏడీసీపీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన ద్వారకా సబ్ డివిజన్ క్రైం సీఐ వి.చక్రధరరావు, ఎస్‌ఐ ఎస్.రాజు, సిబ్బంది వి.అప్పలరాజు, ఎస్.హరిప్రసాద్ (ఎంవీపీ క్రైం), ఎన్.జగత్‌కిరణ్(ఎంవీపీ క్రైం)లను ఏడీసీపీ అభినందించారు. సమావేశంలో ఏసీపీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

నిబద్ధతకు మారుపేరు మల్లికార్జునరావు



మల్లికార్జునరావు దంపతులతో సమాచార శాఖ అధికారులు

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్‌గా విశేషమైన సేవలందించిన సీహెచ్ మల్లికార్జునరావుకు జిల్లా పౌర సంబంధాల అధికారి ఎస్.వి.రమణ ఘన వీడ్కోలు పలికారు. జిల్లా సమాచార కార్యాలయంలో శనివారం జరిగిన మల్లికార్జునరావు ఉద్యోగ విరమణ సభలో రమణ మాట్లాడారు. మల్లికార్జునరావు తన 33 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో నిబద్ధతతో, సంయమనంతో పనిచేశారని కొనియాడారు. ప్రాంతీయ సమాచార ఇంజినీర్ కార్యాలయం సూపరింటెండెంట్ అన్నమ్మ మాట్లాడుతూ మల్లికార్జునరావు సున్నిత మనస్కుడని, అదే సమయంలో తన బాధ్యతల పట్ల ఎంతో నిబద్ధత కలిగి ఉండేవారన్నారు. డివిజనల్ పీఆర్వో నారాయణరావు మాట్లాడుతూ మల్లికార్జునరావు తన వృత్తికి అంకితమయ్యారని కొనియాడారు. అసిస్టెంట్ ఇంజినీర్ బాలాజీ, ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకట్రావు, సీనియర్ అసిస్టెంట్ మాధవి, పీఆర్వో కిశోర్, పాత్రికేయులు శ్రీనివాసరావు, భగవాన్ తదితరులు మల్లికార్జునరావు చేసిన సేవలను ప్రశంసించారు. అనంతరం మల్లికార్జునరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.17.88 లక్షలు

డాబాగార్డెన్స్: సంపత్ వినాయగర్ ఆలయ హుండీ ఆదాయం శనివారం లెక్కించారు. 24 రోజులకు గాను రూ.17,88,049 నగదుతో పాటు 2.300 మిల్లీ గ్రాముల బంగారం, 125 గ్రాముల వెండి, యూఏఈ, మలేషియా, శ్రీలంక ఇతర దేశాల కరెన్సీ లభించింది. కార్యక్రమంలో సహాయ కమిషనర్, ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఆలయ వ్యవస్థాపక సభ్యుడు టీఆర్ చోళన్, దేవదాయ శాఖ తనిఖీదారు ఎం.శ్రీధర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐఎంవీలో 'ఈపీజీడీపీఎం' ప్రారంభం



మాట్లాడుతున్న హిందూస్థాన్ షిప్‌యార్డు విశ్రాంత సీఎండీ హేమంత్ ఖత్రి

తగరపువలస: గంభీరంలోని ఐఐఎం విశాఖపట్నం(ఐఐఎంవీ)లో రక్షణ రంగ అధికారులు, కార్యనిర్వాహకుల కోసం ఏడాది పాటు నిర్వహించే 'ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (ఈపీజీడీపీఎం)'శనివారం ప్రారంభమైంది. హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ విశ్రాంత సీఎండీ హేమంత్ ఖత్రి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిజిటల్ మౌలిక వసతులు, వందే భారత్ వంటి ఆవిష్కరణలు, 6జీ టెక్నాలజీ వైపు సాగుతున్న ప్రయాణంలో దేశ నాయకత్వ పాత్రను కొనియాడారు. విమర్శనాత్మక ఆలోచన, భావోద్వేగ మేధస్సు, అనుకూలత, సృజనాత్మక సమస్య పరిష్కార సామర్థ్యాల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఐఐఎంవీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ డైనమిక్, టెక్నాలజీ ఆధారిత ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా రక్షణ సిబ్బందిని సిద్ధం చేయడానికి ఈ కోర్సును రూపొందించినట్లు చెప్పారు. అడ్మిషన్స్ చైర్ ప్రొఫెసర్ ప్రశాంత్ ప్రేమ్‌కుమార్ నాయర్ మాట్లాడుతూ ఈ బ్యాచ్‌లో సగటు వయసు 38 సంవత్సరాలు కాగా.. 13 సంవత్సరాల పని అనుభవం కలిగిన వారు దేశంలోని వివిధ ప్రాంతాల్లో రక్షణ రంగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ప్రోగ్రాం చైర్ ప్రొ.శ్రీరంగాచార్యులు మాట్లాడుతూ ఈ కోర్సు మాడ్యులర్ ఎంబీఏగా హైబ్రిడ్ ఫార్మాట్‌లో రూపొందించినట్లు చెప్పారు. డీన్ కావేరీ కృష్ణన్ మాట్లాడారు.